కాళరాత్రి అలంకరణలో అమ్మవారు


శుభానందదేవి..


మూల నక్షత్ర వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కాళేశ్వరం: కాళేశ్వర క్షేత్రంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని సరస్వతీ ఆలయంలో ఉత్సవ విగ్రహానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. బుధవారం శుభానందదేవీ, సరస్వతీలు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయవాడకు చెందిన జగదీష్ అనే భక్తుడు వివిధ రకాల పండ్లను అప్పగించగా అర్చకులు పండ్ల హారంతో శుభానందదేవీని అలంకరించారు. మూలనక్షత్రం వేడుకల్లో భాగంగా దేవస్థానం అధికారులు చిన్నారులకు పలకలు, నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు బుర్రిశ్రీనివాస్, మాజీ సర్పంచి మాధవి, మాజీ ధర్మకర్తలు అడుప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, మెంగాని అశోక్ పాల్గొన్నారు.

జగమేలుతోంది.. మన బతుకమ్మ

'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..
ఏమేమి కాయప్పునే గౌరమ్మ..
చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ..
ఒక్కేసి పువ్వేసి సందమామ.. బతుకమ్మ బతుకమ్మ
ఉయ్యాలో.. మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో..
అంటూ ఓరుగల్లువ్యాప్తంగా బతుకమ్మ పాటలు మారుమోగుతున్నాయి..

నేడు సద్దుల బతుకమ్మ

ఎన్నో ప్రత్యేకతలు.. సంప్రదాయాల మేళవింపు

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, న్యూస్‌టుడే, నర్సంపేట, దేవరుప్పుల(జనగామ)

ఇంద్రధనస్సులోని వర్ణాలు కలిగిన తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ నేడు జగమేలుతోంది.. తెలంగాణ సంస్కృతికి పూల పండగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.. మన సంప్రదాయాన్ని విదేశాల్లోనూ వ్యాప్తి చేస్తున్నారు.అక్కడ స్థిరపడ్డ మనవాళ్లు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ పండగను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

16 ఏళ్లుగా ఒక్కో అడుగు పెంచుతూ..



నర్సంపేటకు చెందిన రుద్రారపు సరోజన-పైడయ్య దంపతులు తొమ్మిది రకాల పూలతో ఏటా ఒక అడుగు పెంచుతూ పెద్ద బతుకమ్మను పేరుస్తున్నారు. 16 ఏళ్ల కిందట తొలిసారి 3 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చారు. అప్పటి నుంచి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ వస్తున్నారు. ఈసారి 12 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజులుగా పలువురు కూలీలతో పెట్టి కొత్తగూడ, గంగారం, పాకాల అడవుల్లో గునుగు, తంగేడు, టేకు, అల్లీ పూలు, తామర, సీతజడ, బంతి, చామంతి వంటి 9 రకాల పూలను సేకరిస్తున్నారు. ఇంట్లో మహిళా కూలీలతో వాటిని కట్టలు కట్టిస్తున్నారు. ప్రత్యేకం ట్రాలీలో బతుకమ్మను మైదానానికి భాజాభజంత్రీల నడుమ తీసుకొస్తారు.

కన్నడిగులకు మక్కువ..



బతుకమ్మ పండగను కన్నడ ప్రజలు బాగా ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని హసన్ జిల్లా హళబిడ గ్రామానికి చెందిన అయ్యంగార్ యమున-రాజు దంపతులు పదేళ్ల కిందట నర్సంపేటకు వచ్చి బేకరీ నడుపుతున్నారు. ఇక్కడి ప్రజలు పూలను ఆరాధించే సంస్కృతి వారికి బాగా నచ్చింది. సొంతంగా బతుకమ్మ పేర్చి ఇక్కడి మహిళలతో కలిసి ఆడుతున్నారు.

సీతంపేటలో దీపావళికి వేడుకలు.. పురుషులూ ఆడుతారు..



భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్థులు దీపావళి పండగ సమయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. గ్రామస్థులు తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తున్నారు. దీపావళి రోజున పుట్టమన్ను తీసుకొచ్చి ఇళ్లలో జోడెడ్ల ప్రతిమలను తయారు చేసి పూజిస్తారు. మరుసటి రోజున కేధారేశ్వర వ్రతం చేస్తారు. జోడెడ్లను అలంకరించి ఊరేగిస్తారు. తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారు. మరుసటి రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. మహిళలతో పాటు, పురుషులు కూడా బతుకమ్మ ఆడుతారు.



విదేశాల్లోనూ సందడే..


టోక్యో నగరంలో..

ఒకప్పుడు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే సందడి చేసిన బతుకమ్మ పండగ నేడు విశ్వవ్యాప్తమైంది. యూకేలోని వారిక్ పట్టణంలో జరిగే వేడుకలు ఉత్తరాది దక్షిణాది సంస్కృతుల మేళవింపుగా సాగుతున్నాయని తెలుగు ఆడపడుచు, అక్కడి కౌన్సిలర్ ఎల్లాప్రగడ హేమ తెలిపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం విదేశీ మహిళలు ఆసక్తిగా గమనించి.. తమతో కలిసి వస్తున్నారని తెలుగు మహిళలు చెబుతున్నారు.

ముందస్తు అనుమతి తీసుకుంటాం..



- తాటిపాటి పల్లవీ-సాగర్, కోటోకు ఓజీమా వీధి, టోక్యో (దేవరుప్పుల మండలం సీతారాంపురం)

మా వీధిలో 60 వరకు తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మ పండగను అందరం కలిసి జరుపుకొంటాం. సామూహికంగా నిర్వహించాలి కాబట్టి అధికారుల ముందస్తు అనుమతి తీసుకుంటాం. గడ్డిపూలు, వివిధ రాకల పూలతో బతుకమ్మ పేర్చి, ఒక దగ్గర గుమిగూడి ఆటపాటలతో సందడి చేసి, వాయినాలు ఇచ్చుకుంటాం. సమీపంలోని నదిలో నిమజ్జనం చేస్తాం.

వంటకాలను ఇచ్చిపుచ్చుకుంటాం..



- పెద్దాపురం మమత, అల్బనీ, అమెరికా, (దేవరుప్పుల)

అల్బనీ ప్రాంతంలో బతుకమ్మకు ప్రత్యేకంగా పూలు తెచ్చి మార్కెట్‌లో అమ్ముతుంటారు. ఇక్కడ తెలుగు సహా ఇతర రాష్ట్రాల మహిళలు కలిసి వేడుకలు జరుపుకొంటారు. సద్దుల బతుకమ్మ నాడు వండిన వంటకాలను ఒకరికొకరం పంచుకుంటాం.

ఇంట్లోనే నిమజ్జనం..



- గాదె ఉపశ్రీ, చెక్ రిపబ్లిక్, (దేవరుప్పుల)

మేము ఉండే దగ్గర 25-30 తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మను ఎవరి నివాసంలో వారే నిర్వహించి, అష్టమి రోజు ఒక నీటి తొట్టి ఏర్పాటు చేసుకొని నిమజ్జనం చేస్తాం. వీలును బట్టి అందరి ఇళ్లు కలియతిరిగి శుభాకాంక్షలు చెప్పుకొంటాం.

● కెనడా రాజధాని అటవా నగరంలో వరంగల్ జిల్లాకు చెందిన పలు అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి మండలం దండేపల్లికి చెందిన సుధీర్ కోదాటి ఈ ప్రాంతంలోని తెలుగువారిని సంఘటితం చేసి గత 15 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. తెలుగు అసోసియేషన్ నిర్వహించే బతుకమ్మ వేడుకలకు బంగారు నాణేలు, 500 డాలర్లు బహుమతులుగా ఇస్తున్నారు. 19 ఏళ్ల కింద అమెరికాలోని షికాగాలో స్థిరపడిన వర్ధన్నపేటకు చెందిన పూర్ణచందర్ అల్లమనేని 2003 నుంచి ఘనంగా సంబరాలు జరుపుతున్నారు.

రాములోరికి ఘనంగా తిరుమంజనం


రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

భద్రాచలం, భూపాలపల్లి, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో కొలువైన కోదండ రాముడికి అర్చకులు సుప్రభాతం పలికి నామార్చనలు నిర్వహించారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచించారు. సీతమ్మవారికి యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ చేయించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక పరమానందకరంగా సాగాయి. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కుటుంబ సమేతంగా వచ్చి రామయ్యను దర్శించుకున్నారు. ఈయనకు ఏఈవో భవానిరామకృష్ణారావు, పీఆర్వో సాయిబాబా సాదర స్వాగతం పలకగా వేద పండితుడు ఆశీర్వచనం అందించారు.

కొలువు దక్కింది.. కల నెరవేరింది


బస్సుల ముందు అధికారులు

భూపాలపల్లి, టేకుమట్ల, న్యూస్‌టుడే : ఇన్నాళ్ల పడిన శ్రమకు ఫలితం దక్కింది.. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు నియామక పత్రం అందుకోవడంతో ఆనందం వెల్లివిరిసింది.. కలల కొలువు దక్కిందని సంబరాల్లో మునిగి తేలారు.. డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు తీసుకోవడానికి భూపాలపల్లి నుంచి బుధవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, సిబ్బంది కలిసి 1:1 నిష్పత్తిలో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసిన జాబితా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించారు. డీఎస్సీ-2024లో ప్రకటించిన పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా మంచి ర్యాంకులు సాధించినవారే ఎంపికయ్యారు. మొత్తం జిల్లాలో 212 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థులను ఐదు ఆర్టీసీ బస్సుల్లో పంపించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. మంజూరునగర్ ప్రాంతంలో ఐదు బస్సులను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జెండా ఊపి, వారిని పంపించారు. కార్యక్రమంలో ఆర్డీవో మంగీలాల్, డీఈవో రాజేందర్, ఎంఈవో దేవానాయక్, అధికారులు లక్ష్మణ్, రాజగోపాల్, ఆర్ఐ రామస్వామి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో ఇద్దరు గురువులు..


కరుణతో భర్త స్వామి..

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన మచ్చ కరుణ ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. మండలంలోనే ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సోమిడి స్వామి, కరుణకి 2015లో వివాహం జరిగింది. అప్పటి నుంచి స్వామి భార్యను ఉపాధ్యాయురాలుగా చూడాలని అనుకున్నాడు. ఆమెను డీఎడ్ చదివించి డీఎస్సీకి సన్నద్ధం చేయించారు. డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించారు. బుధవారం కరుణ నియామక పత్రాలను అందుకున్నారు.

ఏడాదిలోనే రెండు కొలువులు..


మాచర్ల వెంకటేశ్వర్లు

కాటారం: కాటారం మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన మాచర్ల వెంకటేశ్వర్లు ఎస్ఏగా ఉద్యోగం సాధించారు. గతంలో జనగామ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తూ.. ప్రభుత్వ ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి సన్నద్ధం అయ్యారు. మొదటగా గురుకుల పాఠశాలలో జోన్ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి టీజీటీ ఉద్యోగం సాధించారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లోనూ స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్రంలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. ఏడాదిలోనే రెండు కొలువులు సాధించి ఆదర్శంగా నిలిచారు.

సంతోషంగా ఉంది



-ఇప్పకాయల సతీష్, భాస్కర్‌గడ్డ

డీఎస్సీలో సాంఘికశాస్త్రం సబ్జెక్టులో 3వ ర్యాంకు సాధించాను. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. అదేవిధంగా రైల్వేలోనూ ఉద్యోగం వచ్చింది. కానీ, ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే నా లక్ష్యం నెరవేరింది. 2017లో ఒకసారి డీఎస్సీ రాస్తే ఒక్క మార్కులో ఎంపిక కాలేదు. నేడు సీఎం చేతులమీదుగా నియామకపత్రం తీసుకోవడం సంతోషంగా ఉంది.

ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందిపడ్డా..



-మేడిగడ్డ నాగరాజు, పలిమెల

పదేళ్లుగా పలిమెల మండలంలో విద్యాశాఖలోనే కాంట్రాక్టు పద్ధతిలో సీఆర్‌పీగా విధులు నిర్వరిస్తున్నా. తక్కువ వేతనాలతో నా ముగ్గురు పిల్లలకు ఫీజులు చెల్లించడానికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇప్పుడు కష్టపడి డీఎస్సీలో పరీక్ష రాస్తే ఎస్ఏ ఫిజికల్‌సైన్సులో జిల్లా స్థాయిలో 5వ ర్యాంకు సాధించా..

బదిలీల వాయిదా.. విద్యుత్తు ఉద్యోగుల్లో నిరాశ

న్యూస్‌టుడే, భూపాలపల్లి

అన్ని ప్రభుత్వ శాఖల్లో సాధారణ బదిలీల ప్రక్రియ ఇప్పటికే దాదాపు పూర్తికాగా.. విద్యుత్తు శాఖలో కొంత ఆలస్యమైనా ఎట్టకేలకు బదిలీలు చేపట్టినందుకు ఎంతో సంతోషించారు. కొన్నేళ్లుగా మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు ఈ బదిలీల ద్వారా పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశం వచ్చిందని ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆనందించారు. సుమారు పది రోజులుగా ఈ ప్రక్రియ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా జరిగింది. ఒకే చోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీకి అవకాశం కల్పించారు. క్యాడర్ మొత్తంలో 50 శాతం మాత్రమే బదిలీకి వీలుంది. ఓఅండ్ఎం సిబ్బంది తప్ప మిగతా అందరికీ వెబ్ ఆప్షన్ల ద్వారా బదిలీల ప్రక్రియ కొనసాగింది. కేటాయించిన ప్రాంతాలకు సంబంధించి ఉత్తర్వుల పత్రాలను సైతం తయారు చేశారు. నిబంధనల ప్రకారం ఈ నెల 7న బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితా ప్రకటించడంతో పాటు ఈ నెల 9లోపు రిలీవ్ అయి మరుసటి రోజు కొత్త స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి చేరుకుని బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూశారు. ఇంతలోనే జిల్లా అధికారి ఒకరు బదిలీలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆయా ఉద్యోగులు నిరాశతో వెనుదిరిగారు.

జిల్లాలో బదిలీలకు అర్హత ఉన్న వారి వివరాలు ..	
డీఈ	1
ఏడీఈ	6
ఏఈ	7
సబ్ ఇంజినీర్‌లు	18
సీనియర్ అసిస్టెంట్	13
జూనియర్ అసిస్టెంట్	12
సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్	6
జేఏవోలు	8
ఫోర్‌మెన్‌లు	3
లైన్‌మెన్‌లు	22
ఆఫీసు సబార్డినేట్	7

పది రోజులుగా ఎదురుచూపులు

విధి విధానాలను ప్రకటించిన నాటి నుంచి గత పది రోజులుగా బదిలీ ప్రక్రియపైనే చర్చలు జరిగాయి. ఎవరు అర్హులు..? ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి. వారికున్న యూనియన్, కుల సంఘాలు, స్పౌజ్ అవకాశాలను కొందరు సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించారు. మరికొందరు అధికార పార్టీ ముఖ్య నేతల నుంచి పైరవీలు ప్రారంభించినట్లు సమాచారం.. మొత్తం 11 క్యాడర్లలో 103 మంది ఉద్యోగులు జిల్లాలో బదిలీ కానున్నట్లు తెలిసింది. జిల్లా పరిధిలో బదిలీల ప్రక్రియ డివిజన్ స్థాయిలో ఒక సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు చేపట్టారు. జేఎల్ఎం, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఎల్ఎం, లైన్‌మెన్, అటెండర్ స్థాయి ఉద్యోగుల బదిలీల ప్రక్రియ డివిజన్‌లోని డీఈల ఆధ్వర్యంలో పూర్తి చేశారు. సర్కిల్ పరిధిలో ఎస్ఎల్ఐ, ఫోర్‌మెన్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, జేఏవో, సబ్ ఇంజినీర్ తదితర ఉద్యోగుల బదిలీకి సిద్ధం చేశారు.


భూపాలపల్లి విద్యుత్తు సబ్ డివిజనల్ కార్యాలయం

పండగ కారణంగానే

బదిలీల ఉత్తర్వులు జారీచేసే కొద్ది గంటల్లోనే ప్రక్రియ వాయిదా పడటంతో ఉద్యోగుల్లో పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా బదిలీలు చేస్తే.. కొత్తగా బదిలీపై వెళ్లిన వారు ఆ ఏరియాలో విద్యుత్తు సమస్యలపై అవగాహన ఉండకపోవడంతో ప్రమాదవశాత్తు ఏదైనా సమస్య తలెత్తితే వినియోగదారుల నుంచి వ్యతిరేకత ఏర్పడుతుందనే కారణంతోనే తాత్కాలికంగా బదిలీలను వాయిదా వేసినట్లు కొంతమంది అధికారులు చెబుతున్నారు. మరికొందరు హనుమకొండ, వరంగల్ లాంటి పెద్ద పట్టణ ప్రాంతాల్లో కొన్నేళ్లుగా పాతుకుపోయి, ఈ సారి తప్పనిసరి మరో చోటుకు వెళ్లాల్సి వస్తుందనే కారణంతో ఆయా ఉద్యోగులు, కొంత మంది యూనియన్ నాయకులు ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడంతో బదిలీలు నిలిచిపోయాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బదిలీల కోసం వెబ్ ఆప్షన్ల విధానాన్ని అమలు చేయడంతో కొంత మంది యూనియన్ నాయకులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. పండగ తర్వాతనైనా బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారా..? అనేది సందిగ్ధంగా మారింది.

కాళేశ్వర దేవస్థానం అభివృద్ధికి అంచనాలు


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, పక్కన కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గోదావరిలో భక్తులు వ్యర్థాలు వేయకుండా చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలని, టోల్ వసూలు ద్వారా వచ్చే ఆదాయంతో ఘాట్ వద్ద పారిశుద్ధ్య పనులు, స్నాన ఘట్టాలు, అస్థికల నిమజ్జనం, ఘాట్ వద్ద విడిచిన దుస్తులు, వ్యర్థాలు ట్రాక్టర్ ద్వారా తరలించేందుకు పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు చేపట్టాలన్నారు. వంద గదుల సత్రం, అన్నదాన సత్రం, యాత్రికుల సౌకర్య కేంద్రం త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. గోదావరి ఒడ్డున భక్తులు దుస్తులు మార్చుకునేందుకు శాశ్వత ప్రాతిపదికన గదుల ఏర్పాటుతో పాటు షవర్లు ఏర్పాటు చేయాలన్నారు. సులభ్ కాంప్లెక్స్ నుంచి మురుగు గోదావరిలో కలవకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆలయ పరిసరాల్లో శివనామం మారుమోగేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులు ఎక్కడినుంచైనా గదులు బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఈవోను ఆదేశించారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, సీపీవో బాబురావు, పీఆర్ ఈఈ దిలీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, దేవస్థానం ఈవో మారుతి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సింగరేణి బకాయిలు చెల్లించాలి

భూపాలపల్లి : సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, కోల్‌బెల్ట్ ప్రాంతం ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపెటి రాజయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రసాద్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాజయ్య మాట్లాడుతూ.. యాజమాన్యం ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలంటే ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వసూలు చేయాలని చెప్పారు. నాయకులు శ్రీనివాస్, తోట రమేష్, ఏసుబాబు, లక్ష్మణ్, నిరంజన్, భద్రయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


పిట్టల కుమార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన తెలంగాణ మొదటి పోలీస్ డ్యూటీ మీట్ జోనల్ స్థాయిలో సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫొటోగ్రఫీ విభాగంలో జిల్లాకు చెందిన పోలీస్ కానిస్టేబుల్, క్లూస్ టీం సభ్యుడు పిట్టల కుమార్ మొదటి బహుమతి సాధించారు. ప్రస్తుతం చిట్యాల ఠాణాలో పనిచేస్తూ, క్లూస్ టీంలోనూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్పీ కిరణ్ ఖరే ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లా నుంచి ఫొటోగ్రఫీ కాంపిటేషన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కుమార్‌ను పలువురు పోలీసు అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

వందేభారత్ తయారీ ఇక్కడే!

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనతో ఆనందం
- అదనంగా రూ.66 కోట్లు మంజూరు

> ప్రస్తుతం మడికొండలోని మెట్టుగుట్ట సీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన 240 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయి. ఇందులో 160 ఎకరాలు రైల్వేకు ఇచ్చారు. మిగిలిన స్థలం కూడా కోచ్‌ల నిర్మాణానికి కేంద్రం సేకరించే అవకాశాలున్నాయి.

కాజీపేట, న్యూస్‌టుడే

ఓరుగల్లు ప్రజల చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది. గత 45 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో కాజీపేటలో కోచ్‌లు తయారు చేస్తామని ప్రకటించడం ఆశలు రేపాయి. రైల్వే జంక్షన్ కాజీపేటలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న వ్యాగన్ తయారీ కేంద్రాన్నే అప్‌గ్రేడ్ చేసి కోచ్‌లు తయారు చేయాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్న వందే భారత్ రైలు కోచ్‌లు ఇక్కడ తయారు చేయాలని నిర్ణయించడం కాజీపేటకు గొప్ప మలుపు కాబోతోంది.

ఒక్కో అడుగు పడుతూ..

వరంగల్ ప్రజల నాలుగు దశాబ్దాల ఉద్యమ ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ. 1980 దశకంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం సైతం మంజూరు చేసింది. డీజిల్ షెడ్ పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. పంజాబ్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ పరిశ్రమలు నెలకొల్పి యువతను ఆకట్టుకోవాలనే ఆలోచనతో కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని కపుర్తాలకు మార్చారు. అప్పటి నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. 2010లో వ్యాగన్ మరమ్మతుల వర్క్‌షాపు, వ్యాగన్ తయారీ కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అక్కడ స్థలం లేకపోవడంతో కాజీపేటకు తరలించారు. ఇక్కడా స్థల సేకరణలో ఆలస్యమైంది. చివరికి 2016లో వ్యాగన్ షెడ్ కోసం నిధులు కేటాయించారు. ఎట్టకేలకు 2023లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు పనులను ప్రారంభించారు. స్థానికులు దీనిపై అసంతృప్తిగా ఉండటంతో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపుతో పాటు పిరియాడికల్ ఓవరాహాలింగ్ కేంద్రాన్ని సైతం మంజూరు చేశారు. కోచ్ మీద ఉన్న ఆశ అలాగే ఉంది. స్థానిక రైల్వే ఐకాస ఆధ్వర్యంలో కోచ్ సాధన సమితి పేరు మీద ఆందోళన చేశారు. చివరకు దేశవ్యాప్తంగా వందేభారత్ రైలు కోచ్‌లకు డిమాండ్ ఉండటంతో వ్యాగన్ తయారీ పరిశ్రమను, పీఓహెచ్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అభివృద్ధి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.





సిద్ధంగా క్రేన్లు

నిర్మాణంలో భారీ షెడ్

అడ్డంకులు లేకుండా ఉన్న స్థలంలోనే..

కోచ్ ఫ్యాక్టరీకి మరింత స్థలం అవసరం. సేకరణకు సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి 160 ఎకరాలను సేకరించి వ్యాగన్ పరిశ్రమను నెలకొల్పుతున్నారు. రెండు ప్రధాన షెడ్ల నిర్మాణం, కార్యాలయాల భవనాలు నిర్మిస్తున్నారు.. దీనికి అదనంగా మరో షెడ్‌ను నిర్మించడానికి రూ.66 కోట్లను కేంద్రం విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 160 ఎకరాల్లోనే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకోవాలని చూస్తున్నారు.. రాబోయే రోజుల్లో అదనపు స్థలం సేకరించి మరింత విస్తరిస్తారు.

చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో

చెన్నై పెరంబూరులో గల ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో ఇక్కడ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ వందే భారత్ కోచ్‌లు తయారవుతున్నాయి. దీనికి అదనంగా ఇప్పుడు కాజీపేటలో ప్రారంభం అవుతాయి.

3000 మంది సిబ్బంది..

కోచ్ ఫ్యాక్టరీకి 3000 మంది సిబ్బంది అదనంగా రానున్నారు. పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమలకు 2000 మంది అవసరం అవుతారు. రెండు పరిశ్రమలకు కలిపి మొత్తం 5000 మంది కార్మికులు వచ్చే అవకాశం ఉంది. ముందుగా వందేభారత్ రైళ్ల కోచ్‌ల తయారీపైనే దృష్టి పెడుతున్నారు. షెడ్ నిర్మాణం కాగానే తయారీ యంత్రాలను అమరుస్తారు. పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసే నిపుణులను రప్పించి ఇక్కడి కార్మికులు, అధికారులకు శిక్షణ ఇస్తారు. కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో పనిచేస్తే రాంపూర్, కాజీపేట ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అనుబంధ పరిశ్రమలు వస్తాయి.



రైల్వే వ్యాగన్‌ల తయారీ కేంద్రం షెడ్



వ్యాగన్ పరిశ్రమ కార్యాలయం

అంకెల్లో వివరాలు..


- కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ గతిశక్తి పథకం కింద ఏర్పాటు చేస్తోంది.
- వ్యాగన్ షెడ్ కాజీపేటలో ప్రతిపాదించిన సంవత్సరం- 2013
- కేటాయించిన నిధులు రూ.521 కోట్లు
- మొదటి దశలో విడుదలైనవి రూ.220 కోట్లు
- వ్యాగన్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది: 2023
- పీఓహెచ్‌గా అప్‌గ్రేడ్ అయింది: 2023
- కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యేది: 2025-26

పడిలేచిన కెరటం..

తపాలా సేవలు ఆదర్శం



ఒకప్పుడు ఇంటి ముందు పోస్ట్.. అన్నమాట వినపడగానే ఇంట్లో అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసేది. దూరాన ఉన్న బంధువుల యోగక్షేమాలను అది మోసుకొచ్చేది. మన క్షేమ సమాచారం తీసుకెళ్లేది. ఇంటింటిని పలకరించే ఆత్మీయ బంధువులా తపాలాశాఖ ఉండేది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం పెరిగి అంతర్జాలం, చరవాణులు అందుబాటులోకి వచ్చాక ఉత్తర ప్రత్యుత్తరాలు కనుమరుగయ్యాయి. మనియార్డర్లు పంపేవారు లేరు. తపాలాశాఖ ప్రాభవం కోల్పోయే పరిస్థితి నుంచి మళ్లీ కోలుకుంది. వినూత్న సేవలతో ప్రజాదరణ పొందుతోంది. గురువారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, శివనగర్



గ్రామస్థాయిలో పటిష్ఠ సమాచార, మానవ వనరులతో కూడిన వ్యవస్థ ఒక్క తపాలాశాఖకే సొంతం. వర్షం కురిసినా.. వరదలు పొంగినా తోకలేని పిట్ట తొంభై మైళ్లు వెళ్తుంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థ తోడుతో తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. సేవలను అందించడంలో వేగం పెరిగింది. సాధారణ సేవలతో పాటు పొదుపు, బీమా, బ్యాంకింగ్ రంగంలోనూ అడుగిడింది.

అందిస్తున్న సేవలు..

సాధారణ తపాలా సేవలతో పాటు స్పీడ్‌పోస్టు, క్యాష్ ఆన్ డెలివరి (సీవోడీ), ఎలక్ట్రానిక్ మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ అప్‌డేట్ (సవరణ), తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు, మైస్టాంప్, వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్. ● పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, కిసాన్ వికాస పత్రాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్, నెలవారీ ఆదాయ పథకం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, 1 నుంచి 5 ఏళ్ల టైమ్ డిపాజిట్ ఖాతాలు, తపాలా బ్యాంకు, ఏటీఎం.

మీసేవ తరహాలో..

విమాన, బస్సు, రైలు టికెట్ల రిజర్వేషన్, అన్ని రకాల బీమా పథకాలు, ఇంటి, నల్లా పన్నులు, గ్యాస్ బిల్లులు, ఈఎంఐ చెల్లింపులు, ఫాస్టాట్యాగ్, ఐటీ రిటర్న్స్, సెల్‌ఫోన్ సిమ్‌కార్డు రిఛార్జి, పాన్‌కార్డు, పాస్‌పోర్టుకు దరఖాస్తులు, పీఎం ఫసల్ బీమా, పీఎం జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి శ్రమయోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం), ప్రధాన మంత్రి లఘు వ్యాపారి మన్-ధన్ యోజన (పీఎం-ఎల్‌వీఎం), ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి), నేషనల్ పెన్షన్ సిస్టం, జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) జారీకి దరఖాస్తు, ఇ-డిస్ట్రిక్ట్ సేవలు.



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలందుకుంటున్న వినియోగదారులు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇలా.. వరంగల్, హనుమకొండ డివిజన్ల పరిధిలో ఐదు ప్రధాన, 90 సబ్ యూనిట్, గ్రామస్థాయిలో 679 తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

లేఖల్లోనే మాట్లాడుకునేవాళ్లం..



- రామ్మూర్తి, విశ్రాంత జైలర్, శివనగర్ (వరంగల్)

నేను 1985 నుంచి తొమ్మిదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా (ప్రస్తుతం వైఎస్ఆర్ జిల్లా) ప్రొద్దుటూరు సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేశాను. నా భార్య సత్యవతి వరంగల్‌లో ఉండేది. ఆమెకు నాలుగు రోజులకు ఒక లేఖ రాసేవాడిని. ఆమె యోగక్షేమాలు, పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ఆరోగ్యం ఎలా ఉందంటూ.. ఉత్తరాల ద్వారా అడిగేవాన్ని. ఆమె రాసిన ఉత్తరం చదువుతుంటే ఆమె మాట్లాడుతున్నట్లే అనుభూతి పొందేవాడిని. టెలికాం రంగం ఎంత అభివృద్ధి చెందినా భావవ్యక్తీకరణ, మనసును కదిలించడం ఉత్తరానికే దక్కుతుంది..

పథకాలపై విస్తృత ప్రచారం



తపాలా పథకాలు, సేవలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధాన గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) సేవలను ఎక్కువగా ఉపయోగించుకునేలా డిజిటల్ సేవలను విస్తృతం చేశాం.

- రవికుమార్, సూపరింటెండెంట్, వరంగల్

చదువుల తల్లిగా భద్రకాళి!



రంగంపేట(వరంగల్), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం వరంగల్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారు సరస్వతీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. లలిత పంచమి పర్వదినం కావడంతో అమ్మ సన్నిధిలో పిల్లలతో అక్షరాలు దిద్దించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి రథసేవ నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. చదువుల తల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

● 'మహాష్టమి(దుర్గాష్టమి) రోజున కోటి యోగిని గణములతో శ్రీభద్రకాళి అమ్మవారి జన్మించారు. అందుకే మహాష్టమి పర్వదినాన సద్దుల బతుకమ్మ ఆడతారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని' ఈవో శేషుభారతి తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై సద్దుమణగని ఆందోళన



రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారును అడ్డుకుంటున్న విద్యార్థులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం విద్యార్థులు చేస్తున్న ఆందోళన సద్దుమణగడం లేదు. బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు పీహెచ్‌డీ- 2022 కేటగిరి-2 రెండో జాబితాలో ప్రవేశాలు కల్పించాలని రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారుకు అడ్డంగా బైఠాయించారు. తమకు ప్రవేశాలు కల్పించే వరకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించడంతో కేయూ ఠాణా ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి వారిని నిలువరించారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఉప కులపతి వాకాటి కరుణకు వివరించి, న్యాయం జరిగేలా చూస్తానని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మంద నరేష్, రాకేష్, మనోహర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

దేశాలు దాటి వెళ్లి.. మృతదేహమై తిరిగొచ్చి!



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉగాండాలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న జనగామకు చెందిన ఇటికాల తిరుమలేశ్ తాను పని చేసే కంపెనీలోనే సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉగాండా నుంచి ఐదు రోజులకు బుధవారం తిరుమలేశ్ మృతదేహం జనగామ పట్టణం గిర్నిగడ్డలోని స్వగృహానికి మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. తిరుమలేశ్ మృతదేహంతో పాటు ఆయన భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండా నుంచి వచ్చారు. జనగామలో ఉన్న మృతుడి తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నా, చెల్లెలు హేమలతతో పాటు కుమార్తె అఖిల ఐదు రోజులుగా మృతదేహం కోసం నిరీక్షిస్తూ కన్నీటి పర్యంతంలో మునిగిపోయారు. 'దేశం కాని దేశం వెళ్లి... శవంగా వచ్చావా.. బిడ్డా.. నీ భార్య పిల్లలను ఆగం చేసితివా బిడ్డా..' అంటూ తల్లి కిష్టమ్మ విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమలేశ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువుకు అవసరమైతే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చి, ఆర్థిక సాయం అందజేశారు. అంత్యక్రియలు పట్టణంలోని మార్కెట్ సమీప శ్మశాన వాటికలో సాయంత్రం 6గంటలకు ముగిసాయి.

నిరుపేద కుటుంబంపై దీర్ఘకాలిక జబ్బు పంజా

● గంటల వ్యవధిలో తల్లీకుమారుడు మృతి



తల్లి చిదురాల శోభతో సాయికిరణ్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం. భార్య, భర్త, ఇద్దరు కుమారులు రోజూ పనిచేసుకొని జీవించేవారు. దీర్ఘకాలిక జబ్బు బారినపడిన తల్లి, కుమారుడు ఒకేరోజు గంటల వ్యవధిలో మృతి చెందారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామానికి చెందిన చిదురాల లక్ష్మణ్ తాపీమేస్త్రీగా, భార్య శోభ (53) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శోభకు రెండేళ్ల కిందట బోన్ టీబీ సోకగా.. గ్రామంలోనే మోటార్ మెకానిక్ పని చేస్తున్న చిన్న కుమారుడు సాయికిరణ్ (25) ఏడాది కిందట నోటి క్యాన్సర్‌కు గురయ్యాడు. ఉన్నంతలో ఆసుపత్రులకు తిరిగి ఖర్చు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. మంచానికే పరిమితమైన తల్లి బుధవారం ఉదయం మృతి చెందగా.. రెండు గంటల వ్యవధిలో కుమారుడు సైతం కన్నుమూశాడు. బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఒకే ఇంట్లో ఇద్దరి మృతి ఆ కుటుంబం, గ్రామంలో విషాదం నింపింది. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులే విరాళాలు వేసుకొని ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

బొగ్గు లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు



శ్రీకాంత్(పాతచిత్రం)

మల్హర్, న్యూస్‌టుడే : మండలంలోని మల్లారం శివారులో బొగ్గు లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన గొడిశెల శ్రీకాంత్(32) తాడిచెర్లలో నివాసం ఉంటున్నారు. స్థానిక ఉపరితల గనిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని చిన్నతూండ్లలో పుట్టింటికి వెళ్లిన భార్య, పిల్లల వద్దకు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో మల్లారం ఊర చెరువు సమీపంలో వెనకనుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు బుధవారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాడిచెర్ల, కొయ్యూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం చోటు చేసుకుందని ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కాటారం సీఐ నాగార్జునరావు బాధిత కుటుంబ సభ్యులతో చర్చించడంతో శాంతించారు. మృతునికి 8 ఏళ్లలోపు ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై హరికేశవ్ తెలిపారు. ఘటన స్థలంలో భార్య, బంధువుల రోదనలు మిన్నంటాయి.

గుడుంబా స్థావరాలపై దాడులు



పెద్దకుంటపల్లి తండాలో..

భూపాలపల్లి, కాటారం, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు గిరిజన తండాలు, గ్రామాల్లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా బుధవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 2,320 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 124 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి ఉపయోగించే పాత్రలను ధ్వంసం చేసి, 13 మందిపై కేసులు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి వేముల శ్రీనివాస్ తెలిపారు. నాటు సారా తాగడంతో అనారోగ్యానికి గురికావడమే కాకుండా ప్రాణాలు కోల్పోతున్నారని, జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా సారా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ హెచ్చరించారు. దాడుల్లో డీఎస్పీలు సంపత్‌రావు, రాంమోహన్‌రావు, భూపాలపల్లి, కాటారం సీఐలు నరేష్‌కుమార్, మల్లేష్, ఎక్సైజ్ అధికారులు రమ్యారెడ్డి, రాజసమ్మయ్య కిష్టయ్య, షేక్ రబ్బానీ, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహా సరస్వతి నమోస్తుతే..!



కన్యకా పరమేశ్వరి ఆలయంలో

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఏడో రోజు బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ సరస్వతీ మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పక్కీరుగడ్డ గ్రామంలో దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి సమక్షంలో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు, పలకలు స్థానిక కందుకూరి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాలిగం రాజు, పక్కీరుగడ్డ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పలు మండలాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్ల విగ్రహాల దగ్గర మహాలక్ష్మి హోమం, కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మహదేవపూర్ : శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని శ్రీ గర్భగౌరి సంస్థాన్ సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సరస్వతి హోమం, సామూహిక కుంకుమ పూజలు చేశారు. దుబ్బగూడెంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, సరస్వతి పూజ చేశారు. గంగ దేవి ఆలయంలో సైతం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు కొమ్మెర శ్రీరాంమూర్తి, టి.నిశాంత్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మొట్లపల్లి గ్రామ శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వర ధార్మిక భజనమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన దుర్గామాత బుధవారం సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కమిటీ సభ్యులు, మాజీ సర్పంచి నరహరి పద్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గూడురి రఘుపతిరెడ్డి, కమిటీ సభ్యులు డ్యాగ రమేష్, ఆళ్ల లక్ష్మారెడ్డి, కర్ణాటకపు దేవేందర్, వోల్లాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిట్యాల : చిట్యాల మండలం గోపాలపురం గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం నిర్వాహకులు, భక్తులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాత ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. అనంతరం సుమారు 1000 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్, విజేందర్, బాచి, అఖిల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



పక్కీరుగడ్డలో విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేస్తున్న సత్యనారాయణ



మహదేవపూర్ : సరస్వతీదేవి అవతారంలో అమ్మవారు



మొట్లపల్లిలో అన్నదానం



గోపాలపురంలో ప్రత్యేక పూజలు

మొక్కలు పెంచితేనే భావితరాలకు మనుగడ




మంజూరునగర్ ప్రాంతంలో ప్రధాన రోడ్డు మధ్య డివైడర్‌లో మొక్క నాటి, నీరుపోస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ప్రతి వ్యక్తి మొక్కలు నాటి సంరక్షిస్తేనే భావితరాలకు మనుగడ ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలోని కుందూరుపల్లి గ్రామం నుంచి పట్టణంలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం వరకు సుమారు 7 కి.మీ పొడవు డివైడర్ల మధ్యలో రెండేళ్ల క్రితం నాటిన కోనోకార్పస్ చెట్లను ఇటీవల నరికివేశారు. ఈ చెట్లతో ప్రజలకు శ్వాసకోశవ్యాధులు వస్తున్నాయని ఫిర్యాదులు రావడంతో పూర్తిగా తొలగించారు. డివైడర్ మధ్యలో బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో అధికారులు మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కకు నీరు పోసి సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, వార్డు కౌన్సిలర్లు అనిల్, ముంజాల రవీందర్, దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అప్పం కిషన్, కొంరయ్య, శ్రీనివాస్, సంతోష్, రంజిత్ పాల్గొన్నారు.

గణపురం: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం గణపురం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకు కృషి



పథసంచలన్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

చిట్యాల, న్యూస్‌టుడే : ప్రజల్లో దేశభక్తి, సేవా భావం పెంపొందించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని వరంగల్ విభాగ్ సంఘచాలక్ చిలుకమారి సంజీవ్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ చిట్యాల ఖండ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో దాదాపు 150 మంది స్వయం సేవకులు ప్రధాన రహదారి, వీధుల్లో పథ సంచలన్ నిర్వహించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంజీవ్ మాట్లాడుతూ.. వందేళ్ల క్రితం నాగపూర్ పట్టణంలో విజయదశమి పర్వదినం సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మన దేశంలో 65000 గ్రామాల్లో, 60 దేశాల్లో సంఘ శాఖలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవాహ బుర్ర సదయ్య, ఖండ సంఘచాలక్ కనుకుల లక్ష్మారెడ్డి, సేవా ప్రముఖ్ కనుకుల చంద్రారెడ్డి, సహ కార్యవాహ శ్రీరాం రఘుపతి, గడ్డం వెంకటేశ్, ముప్పిడోజు సాయికిరణ్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



వసీం(పాత చిత్రం)

చిట్యాల, న్యూస్‌టుడే : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జూకల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. గ్రామానికి చెందిన మహమ్మద్ వసీం(25) గ్రామంలో కేబుల్ ఆపరేటర్, చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. గతేడాది వివాహం కాగా రెండు నెలల క్రితం భార్య మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె తల్లిగారింటి వద్దనే ఉంటోంది. నాలుగు రోజుల క్రితం భార్య, కుమారుడిని చూసేందుకు వసీం వారింటికి వెళ్లాడు. ఈ క్రమంలో భార్య, భర్తలకు గొడవ అయింది. దీంతో మనస్తాపం చెందిన వసీం బుధవారం జూకల్ గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ్ముడు రహీం పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని చిట్యాల ఎస్సై-2 షాఖాన్, పోలీసులు పరిశీలించారు. తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీఏసీఎస్ ఎరువుల గోదాం తనిఖీ



కాటారం, న్యూస్‌టుడే : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోదాంను మహదేవపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీపాల్ బుధవారం తనిఖీ చేశారు. పీఏసీఎస్‌లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గోదాంను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ధరల పట్టిక, బిల్లు బుక్కులను పరిశీలించి రైతులను అడిగి వివరాలు సేకరించారు. యూరియాను అధిక ధరకు విక్రయిస్తుండడంతో పాటు రైతులకు రసీదులు ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. ఆన్‌లైన్‌లో సాగిన ఎరువుల అమ్మకాలపై మూడ్రోజుల్లో వివరాలు సమర్పించాలని పీఏసీఎస్ సీఈవోకు సంజాయిషీ నోటీసు అందజేసినట్లు ఏడీఏ పేర్కొన్నారు.

పంటల సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి

చిట్యాల, న్యూస్‌టుడే : మిరప, పసుపు పంటల సంరక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు అన్నారు. బుధవారం తిరుమలాపూర్‌లో మిరప, పసుపు పంటల క్షేత్ర పరిశీలన చేశారు. రైతులకు పలు సూచనలు చేశారు. మిరప పంటలో మొక్క దశలో అందించాల్సిన పోషకాలు, వేరు నల్లి, తెల్ల దోమ వంటి చీడపీడల నుంచి బయటపడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు గుర్రం రవి, గొడుగు శ్రీనివాస్, కంచర్ల కిష్టయ్య పాల్గొన్నారు.

మండల కేంద్రం.. బస్సు సేవలు శూన్యం



బస్సు సేవలను పునరుద్ధరించాలని మంత్రికి విన్నవిస్తున్న సింగంపల్లి ప్రజలు(పాతచిత్రం)

మహాముత్తారం మండలం కేంద్రానికి ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోయాయి. ఇన్నాళ్లు ప్రభుత్వ పాఠశాలలు నడవగా విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు వచ్చేది. ప్రస్తుతం సెలవులు కావడంతో బస్సు సేవలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. కాటారం నుంచి యామన్‌పల్లి.. అక్కడి నుంచి మారుమూల ప్రాంతాలకు బస్సు నడుపుతున్నారు. అయితే మండల కేంద్రాన్ని మాత్రం విస్మరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలు 2 కిలోమీటర్ల దూరంలోని యామన్‌పల్లి వద్ద దిగి ప్రైవేటు వాహనాల్లో, లేదంటే నడిచి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలోనూ అదే పరిస్థితి. ఇక మారుమూల గ్రామం సింగంపల్లి పరిస్థితి అలాగే ఉంది. కనుకునూర్ వరకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు బాగున్నప్పటికీ 3 కిలోమీటర్ల దూరంలోని సింగంపల్లికి వెళ్లడంలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మండలానికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్యను గ్రామస్థులు విన్నవించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. మరోమార్గం అంకుషాపూర్, ములుగుపల్లి, పోలారం మార్గంలో ఆర్టీసీ బస్సు సేవలు ఏడాదిగా నిలిచిపోవడంతో ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది.

– న్యూస్‌టుడే, మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా)

ఎల్ఈడీ దీపాల వితరణ

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన చిల్కూరి వెంకట్రామిరెడ్డి గ్రామ అవసరాల నిమిత్తం పది ఎల్ఈడీ లైట్లు వితరణ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుజాత బుధవారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ.30000 ఉంటుందన్నారు. గ్రామ అవసరాలకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆమె కోరారు.

వర్షాలు కురవాలని.. వన భోజనాలకు

కాటారం, న్యూస్‌టుడే : కొద్ది రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టాయని.. వర్షాలు కురవాలని కోరుతూ కొత్తపల్లి తండా ప్రజలు వన భోజనాలకు తరలివెళ్లారు. ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. సమష్టిగా వంటలు చేసుకొని భోజనాలు చేశారు. వర్షాలు కురిసి పాడి పంట చల్లగా ఉండాలని పూజలు చేశారు. గ్రామ నాయకులు ఆజ్మీరా రాములు, ఉదా నాయక్, రావూజీ, శ్యామల్ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి మండలం కొంపెల్లి క్రాస్ రోడ్డు సమీపంలో నుంచి గణపురం మండలం చెల్పూరు వైపు అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెల్పూరు గ్రామానికి చెందిన కొండపల్లి సురేష్, భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన ముంజాల రాకేష్ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, వాహనంలో తరలిస్తున్న క్రమంలోనే వారిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై శిక్షణ

కాటారం, న్యూస్‌టుడే : లేఅవుట్ల, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)పై పంచాయతీ కార్యదర్శులకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. భూముల కొలతలు, అప్లికేషన్‌లో నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. త్వరితగతిన క్రమబద్ధీకరణ పూర్తయ్యేలా శిక్షణ దోహదపడుతుందని ఎంపీవో వీరస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, రాజశేఖర్, శ్రీనివాస్, నాగరాజు, సురేష్, నవ్య, జ్యోత్స్న, లక్ష్మీ పాల్గొన్నారు.

పోలీసు ఉన్నతాధికారుల ప్రత్యేక పూజలు



కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వరం దేవస్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓఎస్డీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి రాగా స్వామివారికి జలాభిషేకం నిర్వహించారు. శుభానంద ఆలయంలో ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు.

వర్గీకరణ చేపట్టకుంటే ప్రభుత్వ పతనం తప్పదు



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ చేపడతామని తెలిపి.. వర్గీకరణ చేపట్టకుండానే ఉద్యోగ నోటిఫికేషన్, నియామకాలు ప్రకటించి మాదిగలను మోసం చేశారని ఆరోపిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా ఇన్‌ఛార్జి అంబాల చంద్రమౌళి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని మాట తప్పిన ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మల్లేశ్, వీకేసీ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి అంబాల అనిల్‌కుమార్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు బొల్లి బాబు మాదిగ, లచ్చయ్య మాదిగ, నోముల శ్రీనివాస్ మాదిగ పాల్గొన్నారు.

క్యాంటీన్ ఖాళీ చేయాలంటున్నారని నిరసన

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : కరోనా లాంటి ఆపత్కాలంలో సేవలు చేశానని.. అందుకు వంద పడకల ఆసుపత్రిలో క్యాంటీన్ ఏర్పాటుకు అధికారులు హామీ ఇచ్చారని.. ఇప్పుడు మళ్లీ ఖాళీ చేయమంటున్నారని, తనకు న్యాయం చేసి అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన రాజేశ్ అనే వ్యక్తి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట బుధవారం నిరసన తెలిపారు. రాజేశ్ మాట్లాడుతూ కరోనా సమయంలో ఎవరూ ముందుకు రాకపోవడంతో క్యాటరింగ్ చేస్తున్న తనను అప్పటి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ పిలిపించి కోవిడ్ రోగులకు భోజనాలు అందించాలని ఆదేశించారన్నారు. జిల్లా ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే డైట్ కాంట్రాక్ట్ ఇప్పిస్తామని తెలపడంతో ప్రాణాలకు తెగించి రెండు విడతల్లో కోవిడ్ రోగులకు భోజనాలు అందించానన్నారు. ఇప్పుడు మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని.. తాను నిర్వహిస్తున్న క్యాంటీన్ ఖాళీ చేయాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, మున్సిపల్ కమిషనర్ నోటీసులు అందించి కుటుంబాన్ని రోడ్డున పడేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు.